

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

## జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

- ఝరాసంఘం జాతరపై క్రాంతి కలెక్టర్ సమీక్ష
- ప్లాస్టిక్ వాడకం పూర్తిగా నిషేధించాలని ఆదేశం

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 21: శివరాత్రి సమీపిస్తున్న నేపథ్యంలో ఝరాసంఘం జాతరకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని తన చాంబర్‌లో ఝరాసంఘం కేతకీ సంగమేశ్వర జాతర ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాలుగు రోజులపాటు జరిగే జాతరకు దాదాపు 2లక్షల మందికి పైగా భక్తులు తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి వచ్చే అవకాశం ఉన్నందున భక్తుల రద్దీకి అనుగుణంగా జాతర ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపాలని ఆదేశించారు. ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్ శాఖల ఆధ్వర్యంలో జాతరకు ప్రజలు వచ్చే మార్గాల్లో మరమ్మతులు వేగంగా చేపట్టాలన్నారు. తాగునీటి వసతి, మరుగుదొడ్ల సౌకర్యం ఉండాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారి ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు పర్యవేక్షించాలన్నారు. ఆలయ సమీపంలో భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయాలన్నారు. సీసీ కెమెరాలు, బందోబస్తు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. టోల్ ఫ్రీ నెంబరు ఏర్పాటు చేసి, జాతరకు వచ్చే ప్రజల్లో తప్పిపోయిన పిల్లలను వారి తల్లిదండ్రులకు అప్పగించడం కోసం జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేయాలన్నారు. 24 గంటలు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. సిబ్బంది తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించి జాతరను విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ మనోజ్, డీఆర్వో పద్మజారాణి, డీపీవో సాయిబాబా, మిషన్ భగీరథ ఎస్ఈ రఘువీర్, పీఆర్ ఈఈ జగదీశ్, జహీరాబాద్ ఆర్డీవో రాంరెడ్డి, టెంపుల్ ఈవో శివరుద్రప్ప, ఆయా మండల ఎంపీడీవోలు, ఎంపీవోలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



వీడియోకాన్ఫరెన్స్‌కు హాజరైన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్ మాధురి, ట్రైనీ కలెక్టర్ మనోజ్ ఇతర అధికారులు

## ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 21:జిల్లాలో నిర్వహించనున్న నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల శాసన మండలి ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాల ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి, ఇతర ముఖ్య ఎన్నికల అధికారులు ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారితో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల పోలింగ్ నిర్వహణ, ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీ, కేంద్రాల ఏర్పాటు, కరీంనగర్‌లోని రిసెప్షన్ సెంటర్‌కు బ్యాలెట్ బాక్సుల తరలింపు, పోస్టల్ బ్యాలెట్, వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లు, పోలింగ్ కేంద్రాల్లో వసతులు, పోలీసు బందోబస్తు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, నిఘా బృందాల పనితీరు పర్యవేక్షణ తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కలెక్టర్‌కు కీలక సూచనలు జారీ చేశారు. అనంతరం అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ ఈసీ మార్గదర్శకాల ప్రకారం ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో సందర్శించి అవసరమైన సదుపాయలను చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, డీఆర్వో పద్మజారాణి, జడ్పీసీఈవో జానకిరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారి, ఆర్డీవోలు తదితరులు పాల్గొన్నారు.



రాయికోడ్‌లో మాట్లాడుతున్న ఐకేపీ అధికారి శివయ్య

## మహిళా అభివృద్ధే సమాజాభివృద్ధి

రాయికోడ్, ఫిబ్రవరి 21:సమాజంలో మహిళాలు ఆర్థికంగా అభివృద్ధి చెందితే సమాజం అభివృద్ధి చెందుతుందనే ఉద్దేశంతో మహిళా సంఘాలను ఏర్పాటు చేశామని ఐకేపీ మండల అధికారి శివయ్య అన్నారు. శుక్రవారం రాయికోడ్‌లోని ఐకేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల సమైఖ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ....మండలంలో 261 మహిళా సంఘాలను ఏర్పాటు చేశామన్నారు.వీరికి రూ.22 కోట్లు రుణాలు ఇచ్చామని, రుణాలు తీసుకున్న సంఘాల సభ్యులు క్రమం తప్పకుండా రుణాలు చెలిస్తే వారికి వడ్డీ లేకుండా రాయితీ ఇస్తామన్నారు. సమావేశంలో ఐకేపీ సిబ్బంది నర్సింహులు, హనుమంతురెడ్డి, యాదయ్య, భార్గవి తదితర అధికారులు ఉన్నారు.

## ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్న కార్మికులు

జిన్నారం, ఫిబ్రవరి 21: జిన్నారం మండలం ఖాజీపల్లి పారిశ్రామికవాడలోని హెటిరో ల్యాబ్స్ పరిశ్రమలో అగ్ని ప్రమాదం జరిగి ముగ్గురు కార్మికులు తీవ్రంగా గాయపడిన సంఘటన తెలిసిందే. శుక్రవారం ఘటనపై బొల్లారం సీఐ రవీందర్ రెడ్డి వివరాలు వెల్లడించారు. పరిశ్రమలోని డ్రైయర్ వద్ద ఇంటర్మీడియట్ పౌడర్ అన్లోడింగ్ చేస్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో అక్కడే పని చేస్తున్న పరిశ్రమ ఉద్యోగి సీహెచ్ వీర వెంకట్‌రెడ్డి(49), బీహా ర్ రాష్ట్రానికి చెందిన మరో ఇద్దరు హెల్పర్స్ కార్మికులు శైలేంద్ర ప్రసాద్(38),శేషుకు మార్(29) తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే యాజమాన్యం గాయపడిన కార్మికులను నగరంలోని యశోద దవాఖానకు తరలించారు. వైద్యుల పర్యవేక్షణలో దాదాపు 50శాతం కాలిన గాయాలతో ముగ్గురు ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నారు.



పరిశ్రమలో ప్రమాదం జరిగిన ప్రదేశం

పరిశ్రమలో 8 నెలల వ్యవధిలో మరో అగ్ని ప్రమాదం చోటు చేసుకోవడంతో కార్మికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిశ్రమల్లో పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారుల తనిఖీలు, నిఘా లోపాల వల్లే తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని పారిశ్రామికవాడ ప్రజలు వాపోతున్నా. యాజమాన్యం ఫిర్యాదుతో ప్రమాద ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి సమగ్ర దర్యాప్తు చేపట్టారు.

## స్టాండింగ్ కమిటీ సభ్యురాలిగా పుష్పానగేశ్



రామచంద్రాపురం, ఫిబ్రవరి 21: జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలిగా ఆర్సీపురం డివిజన్ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పానగేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల జీహెచ్‌ఎంసీలో స్టాండింగ్ కమిటీ సభ్యురాలిగా ఆమె నామినేషన్ దాఖలు చేశారు. ఈమేరకు ఆమె ఎన్నిక ఏకగ్రీవమైంది. గతంలో కూడా స్టాండింగ్ కమిటీ సభ్యురాలిగా చేసిన అనుభవం ఆమెకు ఉంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలిగా ఏకగ్రీవం కావడం చాలా సంతోషంగా ఉన్నదని తెలిపారు. స్టాండింగ్ కమిటీ సభ్యురాలిగా ఏకగ్రీవం కావడానికి సహకరించిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఆర్సీపురం డివిజన్ అభివృద్ధితోపాటు జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలిగా తన బాధ్యతలను తూచాతప్పకుండా పాటిస్తానన్నారు.

# పాలక మండలి లేకుండానే ఉత్సవాలకు సిద్ధం

- కేతకీ ఆలయానికి వచ్చే దారులు అధ్వానం
- 6ఏ జాబితాలో ఉన్నా అభివృద్ధికి నోచుకోని ఆలయం
- దగ్గరపడుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు
- పట్టించుకోని ప్రభుత్వం..భక్తులకు తప్పని ఇబ్బందులు



కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయం

ఝరాసంగం, ఫిబ్రవరి 21 : ఝరాసంగం కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయానికి తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు భారీ సంఖ్యలో వస్తారు. గతంలో ఆలయానికి సంబంధించి మాస్టర్‌ప్లాన్ ప్రతిపాదించినప్పటికీ ప్రభుత్వం అమలు చేసేందుకు ఆసక్తి చూపడంలేదు. ఏటా రూ.4కోట్లకు పైగా ఆదాయం ఉన్న కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయం 6ఏ జాబితాలో ఉంది.

### గతేడాది నుంచి పాలకవర్గం లేదు...

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఇబ్బందులు కలగకుండా పాలక వర్గం అన్ని ఏర్పాట్లు చేస్తుంది. గతేడాది నుంచి పాలకవర్గం లేకపోవడంతో అధికారులు ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. కేతకీ ఆలయ పాలక మండలి ఏర్పాటు చేయాలని దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు నాలుగు నెలల క్రితమే నోటిఫికేషన్ వేసినప్పటికీ ఇప్పటి వరకు పాలక మండలి ఏర్పాటు చేయలేదు. ఆలయ చైర్మన్ పదవి కోసం అధికార పార్టీకి చెందిన పలు వర్గాల నాయకులు ప్రయత్నాలు చేశారు. జహీరాబాద్ నియోజకవర్గంలో అధికార పార్టీలో గ్రూపులు ఉండడంతో ఎవరికి వారు విశ్వ ప్రయత్నాలు చేస్తూ తమకే చైర్మన్ పదవి కేటాయించాలని పట్టుపట్టడంతో ఎంపికలో ఆలస్యం అయింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పాలక వర్గం ఉండడంతో ఉత్సవాలకు వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించారు. ఇప్పుడు పాలక వర్గం ఏర్పాటు చేయకపోవడం వల్ల భక్తులకు సరైనా సౌకర్యాలు కల్పించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ దృష్ట్యా కమిటీని కూడా ఏర్పాటు చేస్తారా లేదా అనేది స్పష్టత లేదు.



రుక్మాపూర్, సిద్ధాపూర్ మీదుగా ఆలయానికి వచ్చే రహదారి

### అధ్వానంగా ఆలయానికి వచ్చే రోడ్లు

మహారాష్ట్ర, కర్ణాటక భక్తులు బీదర్ మీదుగా గంగ్వార్ నుంచి రుక్మపూర్, సిద్ధాపూర్ మీదుగా ఝరాసంగం ఆలయానికి, తెలుగు రాష్ట్రాల భక్తులు హైదరాబాద్ నుంచి జీర్లపల్లి, ఈదులపల్లి మీదుగా ఆలయానికి వస్తారు. కానీ, ఆలయానికి వచ్చే రహదారులు అధ్వానంగా ఉన్నాయి. ఉత్సవాలకు వారం ముందు నుంచే భక్తుల తాకిడి పెరుగుతుంది. కాలినడకన, వాహనాల మీద వచ్చే భక్తుల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతాయని తెలిసినా సంబంధిత అధికారులు ఎలాంటి మరమ్మతులు చేపట్టడం లేదు. ఇప్పటికైనా అధికారులు సమన్వయంతో పనుల్లో వేగం పెంచి పూర్తి చేసేలా ప్రణళికను తయారు చేయాలి. లేకపోలే రాష్ట్ర ప్రభుత్వానికి మచ్చరావడం ఖాయం.

## పోలింగ్ నిర్వహణపై అవగాహన ఉండాలి

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 21: ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై పూర్తి స్థాయిలో అవగాహన ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి స్పష్టం చేశారు. ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఓపీవోలకు కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో, మైక్రో అబ్జర్వర్లకు సమావేశ మందిరంలోనూ వేర్వేరుగా శుక్రవారం రెండో విడత శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నిర్వహించనున్న నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల శాసన మండలి ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాల ఎన్నికల పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలన్నారు. పోలింగ్ నిర్వహణ, బ్యాలెట్ బాక్సుల వినియోగం, వాటికి సీల్ వేయడం, పోలింగ్‌కు ముందే సిద్ధం చేయడం తదితర అంశాలపై సూచనలు చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పూర్తిగా అనుసరించి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పని చేయాలన్నారు. పోలింగ్‌కు ముందురోజు 26న ఉదయం 8 గంటలకు ప్రిసైడింగ్ అధికారులు తమ బృందాలతో పంపిణీ కేంద్రాలకు చేరుకోవాలని ఆదేశించారు. పోలింగ్ సామగ్రిని పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారి, ఆర్డీవోలు పాల్గొన్నారు. ఈనెల 27న జరగనున్న శాసన మండలి ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాల ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకోనున్న ఉద్యోగులకు ప్రభుత్వం ప్రత్యేక సెలవు ప్రకటించిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి శుక్రవారం తెలిపారు.



బ్యాలెట్ బాక్సులను పరిశీలిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

## రేడియల్ రోడ్డుపై డివైడర్ పనులు షురూ..




రేడియల్ రోడ్డుపై జరుగుతున్న డివైడర్ పనులు

రామచంద్రాపురం, ఫిబ్రవరి 21: తెల్లాపూర్ నుంచి కొల్లూర్ ఓఆర్ఆర్ వరకు ఉన్న ఎక్స్‌టెన్షన్-30 రేడియల్ రోడ్డులో నామమాత్రం పనులు జరగడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు రోడ్డుకు మధ్యలో డివైడర్ నిర్మాణం జరగకపోవడంతో రోడ్డుపైనే రాళ్లురప్పలు ఉన్నాయి. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అసంపూర్తిగా జరిగిన పనులతో రేడియల్ రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా ఉండడంతోపాటు రోడ్డుపై దుమ్మూ, ధూళితో స్థానికులు, వాహనదారులు, వ్యాపారులు, వినియోగదారులు తీవ్రస్థాయిలో ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల నమస్తేతెలంగాణలో 'దుమ్మెత్తిపోస్తున్న రేడియల్ రోడ్డు' అనే శీర్షికను ప్రచురించింది. దీనికి స్పందించిన ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు రేడియల్ రోడ్డుపై డివైడర్ పనులను మొదలుపెట్టారు. కొల్లూర్ ఓఆర్ ఆర్ నుంచి తెల్లాపూర్ వరకు డివైడర్ పనులు జరుగుతున్నాయి. నమస్తేతెలంగాణలో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి కూడా స్పందించి ఆర్‌అండ్‌బీ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. రెండు శాఖల అధికారుల సమన్వయంతో రోడ్డుపై ప్రస్తుతానికి డివైడర్ పనులను నిర్వహిస్తున్నారు. రేడియల్ రోడ్డును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

## ఎల్లంకి కాలేజీలో ఐడియా ల్యాబ్ ప్రారంభం




ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న టెక్నికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ మురళి

పటాన్‌చెరు, ఫిబ్రవరి 21: పటేల్‌గూడలోని ఎల్లంకి కాలేజీలో ఐడియా ల్యాబ్‌ను తెలంగాణ స్టేట్ టెక్నికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ మురళి ప్రారంభించారు. శుక్రవారం గ్రామంలోని ఎల్లంకి ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఏఐసీటీఈ-ఐడియా ల్యాబ్ ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ నూతన ఆవిష్కరణలకు ఐడియా ల్యాబ్ దోహద పడుతుందన్నారు. ఏఐసీటీఈ కొత్త టెక్నాలజీని ల్యాబ్‌లో అందుబాటులో ఉంచుతుందన్నారు. ప్రతి విద్యార్థి కొత్తగా ఆలోచించి అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. తరగతి గదిలో నేర్చుకున్న అంశాలు మానవజాతికి ఉపయోగపడేలా ఉండాలన్నారు. ప్రతిభ ఉన్నవారికి అవకాశాలు ఎప్పుడు ఉంటాయన్నారు. సృజనాత్మకతకు మార్కెట్‌లో పెద్దపీట వేస్తారన్నారు. ఎల్లంకి కళాశాల ఐడియా ల్యాబ్ అందరికి ఉపయోగపడుతుందన్నారు. కళాశాల చైర్మన్ డాక్టర్ సదాశివరెడ్డి మాట్లాడుతూ కళాశాలలో ఏర్పాటు చేసిన ఏఐసీటీఈ-ఐడియా ల్యాబ్ విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఎల్లంకి అటానమస్ ఇనిస్టిట్యూట్ విద్యార్థుల జీవితాలకు దిక్సూచిగా మారిందన్నారు. కార్యక్రమంలో ఏఐసీటీఈ-ఐడియా ల్యాబ్ చీఫ్ మెంటర్, ప్రిన్సిపాల్ డాక్టర్ జాన్‌పాల్, డైరెక్టర్ సాంబశివారెడ్డి, సెక్రటరీ దయాకర్‌రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ సాయికిరన్‌రెడ్డి పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ కుదుర్చుకోవాలి




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానీ

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానీ**

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 21:రాజీ చేయదగిన పోలీసు కేసులు, భార్యాభర్తల వివాదాలు, ఎక్సైజ్, బ్యాంక్ తదితర కేసులు లోక్ అదాలత్‌లో రాజీ కుదుర్చుకోవచ్చని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానీ స్పష్టం చేశా రు. వచ్చే నెల 8న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను పురస్కరించుకొని శుక్రవారం కోర్టులో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ క్షణికావేశంలో చిన్న చిన్న తగాదాల్లో కేసులు నమోదు జరిగి కోర్టుల చుట్టూ తిరుగుతూ తమ విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా కోర్టులో ఉన్న కేసులను రాజీచేసుకొని సామరస్యంగా, స్నేహ భావంతో కలిసి మెలిసి ఉండాలని సూచించారు. జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా కోర్టు జడ్జీలు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రారంభించారు..కొనుగోళ్లు మరిచారు..

నాగల్‌గిద్ద, ఫిబ్రవరి 21:మండల పరిధిలోని మావినెల్లిలో సక్రునాయక్ తండా మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వరంగ సంస్థలైన నాఫెడ్ మార్క్‌ఫెడ్ ఆధ్వరంలో పక్షంరోజులు క్రితం కందుల కొనుగోళ్లు ప్రారంభించారు. కానీ, కొనుగోళ్లు చేపట్టకపోవడంతో రైతులు ఆందోళన చేందుతున్నారు. జూన్ జూలైలో వేసిన కంది పంట ప్రస్తుతం చేతికొచ్చింది. పంట అమ్మడానికి రైతులు సిద్ధమయ్యారు. బహిరంగ మార్కెట్‌లో ధర రూ. 6900 నుంచి రూ. 7200 వరకు పలుకుతుంది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.7500 ఉండడంతో రైతులు మార్కెట్‌కు తీసుకొస్తున్నారు. మార్క్‌ఫెడ్ అధికారులతోపాటు సహకార సంఘం, వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి ఫిబ్రవరి మొదటివారంలో మార్కెట్ యార్డులో కందులు కొనుగోలును లాంఛనంగా ప్రారంభించారు. పక్షం రోజులు గడుస్తున్నా ఇంకా పూర్తిస్థాయిలో కొనుగోలు చేయడం లేదు. గన్నీ బ్యాగుల కొరత వల్ల కొంత ఆలస్యం అవుతుందని స్థానిక అధికారులు తెలిపారు. మార్క్‌ఫెడ్ వారు కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే కొనుగోళ్లు ప్రారంభించాలని కంది రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## ద్విచక్రవాహనంపై కుంభమేళ కు..



ద్విచక్ర వాహనంపై ప్రయాగ్ రాజ్ కుంభమేళాకు చేరుకున్న యువకులు

జిన్నారం, ఫిబ్రవరి 21: జిన్నారం మండలం ఊట్ల గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు సాహసోపేత యాత్రకు శ్రీకారం చుట్టారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ప్రయాగ్ రాజ్ త్రివేణి సంగమం వద్ద కొనసాగుతున్న మహా కుంభమేళ కార్యక్రమానికి గ్రామానికి చెందిన సాయికుమార్, లక్ష్మణ్ ద్విచక్ర వాహనంపై వెళ్లేందుకు సంకల్పించారు. నర్సాపూర్ పట్టణ సమీపంలోని చాకరి మెట్ల వద్ద ఆంజనేయ స్వామిని దర్శించుకొని యాత్రకు పయనమయ్యారు. దాదాపు 1450 కిలోమీటర్లు ద్విచక్ర వాహనంపై ప్రయాణించి 22 గంటల్లోనే ప్రయాగ్ రాజ్ కుంభమేళకు చేరుకుని పుణ్య స్నానం చేశారు. యువకులు తలపెట్టిన కార్యాన్ని దిగ్విజయంగా ముగించాలని గ్రామస్తులు ఆకాంక్షిస్తూ అభినందనలు తెలిపారు.

# రైతులు ఆర్థికంగా ఎదగాలి



గొటిగార్‌పల్లి గ్రామంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న డీసీసీబీ మేనేజర్ శివకుమార్

కోహీర్, ఫిబ్రవరి 21:సహకార బ్యాంకు అందిస్తున్న సేవలను వినియోగించుకొని రైతులు ఆర్థికంగా ఎదగాలని కోహీర్ డీసీసీబీ మేనేజర్ శివకుమార్ కోరారు. శుక్రవారం గొటిగార్‌పల్లి రైతు వేదికలో డీసీసీబీ అందిస్తున్న సేవలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు కోళ్ల పరిశ్రమ, పశువుల పెంపకం, దుకాణాల నిర్వహణ, చేపల పెంపకంతోపాటు ఇంటి నిర్మాణం కోసం రుణాలు మంజూరు చేస్తామన్నారు. రుణాలు పొందిన రైతులందరికీ ఉపాధి లభిస్తుందన్నారు. బ్యాంక్ అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్‌ఆఫీసర్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ రాచయ్య, పీఏసీఎస్ కార్యదర్శులు శ్రీకాంత్, ప్రశాంత్, రైతులు ఉన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ మాతృ భాషాదినోత్సవం





మాట్లాడుతున్న రచయితల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు, కవి నాళేశ్వరం శంకరం

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 21: అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవాన్ని శుక్రవారం తారా ప్రభుత్వ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ రచయితల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు, కవి నాళేశ్వరం శంకరం మాట్లాడుతూ భాష మాతృమూర్తి వంటిదని పేర్కొన్నారు. భాషకు, ధ్వనికి భేదం ఉంటుందన్నారు.ప్రపంచంలో ఆయా దేశాల ప్రజలకు వారి మాతృభాష ప్రధానమైనదని, అంతర్జాతీయ భాషగా ఆంగ్లం గుర్తించబడుతున్నదని, అయితే ప్రతిఒక్కరూ తమ అమ్మ నుంచి వచ్చిన మాతృభాషను మరువరాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా విభాగాక అధ్యాపకులు డాక్టర్ సిచిత్ర సింగ్, డాక్టర్ సుమతీదేవి, డాక్టర్ సదయ్య కుమార్, డాక్టర్ వాణి, డాక్టర్ సంధ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన

పటాన్‌చెరు, ఫిబ్రవరి 21: ఇస్నాపూర్‌లో పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా జరిగింది. శుక్రవారం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ గ్రామంలో పెద్దమ్మతల్లి దేవాలయం స్థిర ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. సంప్రదాయ కళలను ప్రదర్శించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, టీఎస్ఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజయప్రకాష్‌రెడ్డి, పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టుకుమార్‌యాదవ్, బీఆర్‌ఎస్ నాయకులు ఆదర్శ్‌రెడ్డి, గడీల శ్రీకాంత్ గౌడ్‌లను ఘనంగా సన్మానించారు. అమ్మవారి అనుగ్రహంతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు శ్రీశైలం, వెంకట్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్‌లు శోభాకృష్ణారెడ్డి, కృష్ణ, మల్లారెడ్డి, యాదగిరి, రాఘవేంద్ర, రాము ఉన్నారు.

## తల్లిదండ్రులు ప్రత్యక్ష దైవాలు : మాధవానంద సరస్వతి



కృష్ణానంద ఆశ్రమంలో మాధవానంద సరస్వతిని దర్శించుకుంటున్న భక్తులు

గుమ్మడిదల, ఫిబ్రవరి 21: ప్రత్యక్ష దైవాలు తల్లిదండ్రులే అని తోగుట పీఠాధిపతి గురు మాధవానంద సరస్వతి పేర్కొన్నారు. శుక్రవారం గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని రాంనగర్ కాలనీలోని కృష్ణానంద ఆశ్రమాన్ని స్వామిజీ సందర్శించారు. ఈ సందర్భంగా భక్తులు ఆయనను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ తల్లిదండ్రులను మరిచిపోవద్దని సూచించారు. ప్రత్యక్షదైవాలు తల్లిదండ్రులని పేర్కొన్నారు. నిత్యం ఆలయాలను సందర్శించిన మనస్సుకు ప్రశాంతత లభిస్తుందన్నారు. వచ్చే మహా శివరాత్రి సందర్భంగా ప్రతి ఒక్కరూ శివారాధన చేయాలన్నారు. ఆరోజు శివుడిని దర్శించిన, స్మరించిన శివుడి కృపకు పాత్రులవుతారన్నారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

## కేతకీ పరిసరాల్లో పారిశుధ్య పనులు




ఆలయ పరిసరాలను శుభ్రం చేయిస్తున్న అధికారులు

ఝరాసంగం, ఫిబ్రవరి 21: దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన ఝరాసంగం కేతకీ సంగమేశ్వరాలయంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం తహసీల్దార్ తిరుమలరావు, ఎంపీడీవో సుధాకర్ జేసీబీతో ఆలయ పరిసరాల్లో పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఆలయ పరిసరాల్లోని హోటల్ యాజమాన్యులు నాణ్యమైన తినుబండారాలు విక్రయించాలని సూచించారు. నాసిరకం వస్తువులు అమ్మితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం మోడల్ ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమలో ఏపీవో రాజ్‌కుమార్, హౌసింగ్ ఏఈ, పంచాయతీ సిబ్బం ది, ఆలయ సిబ్బంది ఉన్నారు.

### చౌటకూర్ ఎంపీడీవోగా శంకర్

చౌటకూర్, ఫిబ్రవరి 21: చౌటకూర్ ఎంపీడీవోగా శంకర్ నియమితులయ్యారు. పుల్కల్ ఎంపీడీవో కార్యాలయ పర్యవేక్షకుడిగా విధులు నిర్వహిస్తున్న ఆయనను చౌటకూర్ ఇన్‌చార్జి ఎంపీడీవోగా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు ఇన్‌చార్జి ఎంపీడీవోగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి ఎంపీడీవోగా పనిచేసిన రామలింగం స్థానంలో ఆయన్ను నియమించారు. శంకర్‌ను శ్రీకాంత్, ప్రీతం, కార్యదర్శులు ఘనంగా సత్కరించారు.

## వినతుల వెల్లువ

నారాయణఖేడ్, ఫిబ్రవరి 21: నారాయణఖేడ్ ఆర్టీసీ డిపోలో శుక్రవారం నిర్వహించిన డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమంలో ప్రజలు ఆర్టీసీ సేవలకు సంబంధించి పలు సూచనలు చేసినట్లు డిపో మేనేజర్ మల్లేశయ్య తెలిపారు. ఇందులోభాగంగా నారాయణఖేడ్ నుంచి జహీరాబాద్‌కు నడుస్తున్న బస్సులు సమయపాలన పాటించే విధంగా చూడాలని, నారాయణఖేడ్-నాగూర్(బి) బస్సును ఉదయం 8 గంటలకు నడపాలని, నారాయణఖేడ్ నుంచి శ్రీశైలానికి బస్సు నడపాలని, నారాయణఖేడ్ నుంచి రాయిపల్లి, వట్‌పల్లి మీదుగా లింగంపల్లికి బస్సు నడపాలని, నారాయణఖేడ్ నుంచి కంగ్టి మీదుగా పిట్లం, నారాయణఖేడ్ నుంచి కంకోల్, లింగంపల్లి వరకు బస్సును పునరుద్ధరించాలని ప్రజలు ఫోన్‌లో కోరారని చెప్పారు. ప్రజల వినతులను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని డీఎం మల్లేశయ్య వివరించారు.



మాట్లాడుతున్న ఏపీఎం టిక్యానాయక్

### పోషకాహారంతోనే ఆరోగ్యం

ఝరాసంగం, ఫిబ్రవరి 21: ప్రతిఒక్కరూ పోషకాహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఏపీఎం టిక్యానాయక్ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో వివిధ గ్రామాల మహిళా సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధులు సంక్రమించకుండా ఉండాలంటే పరిసరాల శుభ్రతతోపాటు వ్యక్తిగత శుభ్రత ముఖ్యమన్నారు. ప్రతిఒక్కరూ ఆరోగ్యమే మహాభాగ్యంగా భావించి శుభ్రతను పాటించాలన్నారు.కా ర్యక్రమంలో ఐకేపీ సీసీలు మల్లేశం,యాదయ్య, శ్రీనివాస్‌రెడ్డి, ఆయా గ్రామాల మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## పరీక్షా కేంద్రం మార్పు

కోహీర్, ఫిబ్రవరి 21: తెలంగాణ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి నుంచి 9వ తరగతిలో చేరే విద్యార్థులకు ఆదివారం నిర్వహించే ప్రవేశ పరీక్షకు హాజరుకావాలని దిగ్వాల్ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రాములు కోరారు. న్యాల్‌కల్ మండల పరీక్ష సెంటర్‌ను దిగ్వాల్ జీఎంఆర్ కళాశాల ఆవరణకు మార్చామని వెల్లడించారు. విద్యార్థుల తల్లిదండ్రులు గ్రహించి ఉదయం 9.30 గంటల వరకు పిల్లలను పరీక్షా కేంద్రానికి తీసుకురావాలని సూచించారు.